బీఆర్ఎస్వీ అధ్యక్షుడికి సన్మానం

బొజ్జ హరీశ్‌ను సన్మానిస్తున్న హరీశ్‌రావు

హుస్నాబాద్ టౌన్, జూన్ 13: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాదయాత్ర నిర్వహించిన హుస్నాబాద్ పట్టణ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీశ్‌ను సిద్దిపేటలో గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సన్మానించారు. బొజ్జ హరీశ్‌కు జ్ఞాపికను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

మిరుదొడ్డి, జూన్ 13: మండలంలోని చెప్యాలకు చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు యెహోవా శివ తండ్రి అనారోగ్యం పాలై ఆర్వీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం దవాఖానలో బాధితుడిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

వర్గల్, జూన్ 13: వర్గల్ మండలం చౌదర్‌పల్లికి చెందిన పోతగల్ల రవి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స చేయించుకున్నాడు. రవి పెద్ద మొత్తంలో అప్పులు చేయాల్సి వచ్చింది. స్థానిక బీఆర్ఎస్ నాయకుల సూచనతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా, శుక్రవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వర్గల్ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తాళ్లస్వామిగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి

హుస్నాబాద్‌లోని 16వ వార్డులో అవగాహన కల్పిస్తున్న కమిషనర్

హుస్నాబాద్ టౌన్, జూన్ 13: తాగునీరు, పారిశుధ్యంతో పాటు ఇతర సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్ గౌడ్ ప్రజలకు సూచించారు. పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయించి, క్లోరినేషన్‌తో పాటు తడి, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛతకు సహకరించాలని, ఇంటితో పాటు పరిసరాల్లో వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. దోమలు పెరిగితే జబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తడి, పొడిచెత్తను వేరుచేసి ఇవ్వాలని, తడి చెత్తతో ఇంట్లోనే ఎరువును తయారుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి డి. రవికుమార్, వార్డు అధికారులు శివకుమార్, సాంబరాజు, శారద, మమత, బేసిల్ ఫౌండేషన్ సూపర్‌వైజర్ నవీన్, మెప్మా ఆర్పీలు, జవాన్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

ఆర్టీసీ డిపోలో మొక్క నాటిన ఆర్ఎం విజయ్‌భాస్కర్

గజ్వేల్, జూన్ 13: ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితమని, మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ఎక్కువ ప్రయాణిస్తున్నారని మెదక్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం జీపీపీ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొక్క నాటి మాట్లాడారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరం అన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ఎలాంటి సమస్యలున్నా తనకు నేరుగా ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పవన్‌కుమార్, ఎంఎఫ్ జమిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుడిపై హత్యాయత్నం

దవాఖానలో చికిత్స పొందుతున్న ఆదిత్య

హుస్నాబాద్ టౌన్, జూన్ 13: హుస్నాబాద్‌లో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై హత్యాయత్నం కలకలం రేపింది. ఆదిత్య గురువారం రాత్రి పందిల్ల మీదుగా పొట్లపల్లి నుంచి హుస్నాబాద్‌కు వస్తుండగా దుండగులు కత్తులతో దాడిచేసినట్లు ఏబీవీపీ వర్గాలు తెలిపారు. గాయపడిన ఆదిత్యను ముందుగా హుస్నాబాద్‌లోని దవాఖానకు తరలించారు. అనంతరం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. హత్యాయత్నం విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేశ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై శుక్రవారం ఏసీపీ సదానందం నేతృత్వంలో పోలీసులు మరోసారి విచారణ చేపట్టారు. ఏబీవీపీ నాయకుడిపై దాడిని నిరసిస్తూ హుస్నాబాద్‌లో ఏబీవీపీ నాయకులు మల్లెచెట్టు చౌరస్తాలో కమ్యూనిస్టుల దిష్టిబొమ్మను దహనం చేశారు. నిందితులను అరెస్టుచేయాలని డిమాండ్ చేశారు.

బడికి బాటేది..

- రోడ్డు సౌకర్యం లేక బడికి దూరమవుతున్న ఉప్పరోనిగడ్డ పిల్లలు
- బడిబాటకు వెళ్లిన ఉపాధ్యాయులతో గోడు వెల్లబోసుకున్న తల్లిదండ్రులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 13: మీ బడిబాట సల్లగుండా..మా పిల్లలు బడికి వెళ్లేందుకు అసలు బాటేది..? మా పిల్లలను మీ బడికి పంపించేదెట్లా అని బడిబాట కార్యక్రమంలో భాగంగా తమ గ్రామానికి వచ్చిన ఉపాధ్యాయులను రేబర్తి హైస్కూల్ ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా సరిహద్దుగా ఉన్న మద్దూరు మండలంలోని వంగపల్లి గ్రామ శివారు ఉప్పరోనిగడ్డకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఉప్పరోనిగడ్డ పిల్లలు బడికి దూరమవుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి దూరం చేయలేక, ఆర్థిక స్థోమత లేకున్నా 11కిలోమీటర్ల దూరంలోని ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తున్నారు. ఉప్పరోనిగడ్డకు రోడ్డు వేయాలని గతంలో పలుసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, రాత్రుళ్లు ఏదైనా అత్యవసరం ఏర్పడితే దవాఖానలకు వెళ్లలేని పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉప్పరోనిగడ్డ పిల్లల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే పిల్లల కోసం ప్రత్యేకంగా ఓ వాహనాన్ని ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానని తల్లిదండ్రులకు రేబర్తి హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం బాకి చంద్రభాను హామీనిచ్చారు.

బడిబాటకు వెళ్లిన ఉపాధ్యాయ బృందంతో ఉప్పరోనిగడ్డ వాసులు

ఘనంగా ప్రతాప్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

గజ్వేల్: గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

గజ్వేల్: గజ్వేల్‌లో అన్నదానం చేస్తున్న గొలి సంతోష్‌గుప్త



వర్గల్: ప్రతాప్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

గజ్వేల్, జూన్ 13: బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం గజ్వేల్ పట్టణంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఇందిరాపార్కు చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకుడు గొలి సంతోష్‌గుప్త ఆధ్వర్యంలో అన్నదానం చేసి, కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు జకీయొద్దీన్, అత్తెల్లి శ్రీనివాస్, విరాసత్, హైదర్ పటేల్, అల్వాల బాలేష్, పంబాల శివ, రవీందర్, స్వామిచారి, చందు, శ్రీధర్, తోట శ్రీను పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ప్రతాప్‌రెడ్డి నివాసంలో పలువురు నాయకులు కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అక్కారం గోదాంల వద్ద శుక్రవారం గ్రీన్ ఛాలెంజ్ ఇండియాలో భాగంగా హరితసేన జిల్లా కన్వీనర్ చెప్యాల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో హమాలీలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో చెప్యాల శ్రీకాంత్‌రావు, హమాలీలు చంద్రం, యాదగిరి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

జగదేవపూర్‌లో...

జగదేవపూర్, జూన్ 13: గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం జగదేవపూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సీనియర్ నాయకులు యాదవరెడ్డి, గుండా రంగారెడ్డి, కొత్తకవితా శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, కిరణ్‌గౌడ్, ఉపేందర్‌రెడ్డి, నాగరాజు, బాలేశంగౌడ్, కనకయ్య, నరేశ్, ఐలయ్య, రాజు, సత్తిరెడ్డి, యాదగిరి, శ్రీను, బాల్‌రెడ్డి, స్వామి, కనకారెడ్డి, బాపురెడ్డి ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్గల్ మండలంలో...

వర్గల్, జూన్ 13: మండలంలోని ఆయా గ్రామాల్లో వంటేరు ప్రతాప్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యకర్తలు కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు. మీనాజిపేట బీఆర్ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గజ్వేల్: అక్కారంలో మొక్కలు నాటిన హమాలీలు

జగదేవపూర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే కోలుకోవాలని పాదయాత్ర

చేర్యాలలో పాదయాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

కొమురవెల్లి: కొండపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, జూన్ 13 :దవాఖానలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ మూడోవార్డు అధ్యక్షుడు భూమిగారి రాజేందర్, నాయకులు భూమిగారి విజయ్, పుట్ట యశ్వంత్, కల్లాటి విశ్వతేజ యాదగిరి గుట్టకు పాదయాత్ర చేపట్టారు.శనివారం బీఆర్ఎస్ నాయకులు యాదగిరిగుట్టకు చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.పాదయాత్రను చేర్యాలలో శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అనంతుల మల్లేశంతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు నాచగొని వెంకటేశ్ గౌడ్, ఎర్రోల్ల రామచంద్రం, మంచాల కొండయ్య, అరిగే కనకయ్య, యూత్ మండల అధ్యక్షుడు ఆకుల రాజేశ్‌గౌడ్, మహేశ్, కర్రోల్ల ఎల్లీషా, భూమిగారి దామోదర్, రామగల్ల నాగరాజు, భూమిగారి శ్రీరామ్, పాకల అనిల్, కర్రోల్ల యాదయ్య, చుంచు నర్సింగరావు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో ప్రత్యేక పూజలు

కొమురవెల్లి, జూన్ 13 : జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని శుక్రవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బుడిగె గురువయ్యగౌడ్ ఆధ్వర్యంలో కొండపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పేరు మీద అర్చనతో చేయడంతో పాటు ఆలయ ఆవరణలో ముడుపు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పల్లా త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలో పాల్గొనాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ శాఖ మండల అధ్యక్షుడు ఎండీ అర్షద్ అలీ, సీనియర్ నాయకులు మకిలి కనకయ్య, బుడిగె రమేశ్‌గౌడ్, బచ్చల పరశురాములు, సతీశ్, రమేశ్, దర్శనం, కిషన్, అనిల్, నవీన్ కరుణాకర్ పాల్గొన్నారు.

ఎడ్ల గురువారెడ్డి సేవలు చిరస్మరణీయం

సిద్దిపేట టౌన్: ఎడ్ల గురువారెడ్డి వర్ధంతిలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేట టౌన్, జూన్ 13: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, సిద్దిపేట తొలి ఎమ్మెల్యే, డిగ్రీ కళాశాల వ్యవస్థాపక సభ్యులు ఎడ్ల గురువారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయం అని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పాపయ్య, కార్యదర్శి నందిని సిధారెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారెడ్డి వర్ధంతి నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎడ్ల గురువారెడ్డి చదువు విలువ తెలిసిన వారు కాబట్టే ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించడానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. సిద్దిపేట ప్రభుత్వ కళాశాలలో చదివిన లక్షలాది మంది ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుటకు ఆయన తోడ్పడ్డారన్నారు. గురువారెడ్డి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుటకు కృషి చేస్తామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత తెలిపారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, రామచంద్రరావు, సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి అంజయ్య, అధ్యాపకులు మధుసూదన్, గోపాల సుదర్శనం, శ్రీనివాస్, దాసు, సింగోజు మురళీకృష్ణ చార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విక్టరీ చౌరస్తాలో...

సిద్దిపేట, జూన్ 13: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు,సిద్దిపేట తొలి ఎమ్మెల్యే ఎడ్ల గురువారెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద గురువారెడ్డి విగ్రహానికి ఆయన తనయుడు వెంకట్‌రెడ్డి, కవి, గాయకుడు నందిని సిధారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్, తిరుమల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ అంజయ్య పాల్గొన్నారు.

సిద్దిపేట: గురువారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

భారతీయ యోగా ప్రపంచానికి ఆదర్శం

మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి

సిద్దిపేట, జూన్ 13: భారతీయ అపూర్వ వైద్య సంపద గగా వైపు ప్రపంచమంతా దృష్టి సారిస్తుం టే, మనం పాశ్చాత్య సంస్కృతి వైపు చూస్తూ అనారోగ్యాలకు దగ్గరవుతున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రేవతి అన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ , భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చికిత్సలు, మందులతో నయంకాని ఎన్నో అనారోగ్య సమస్యలకు యోగా పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. గర్భిణులు సుఖ ప్రసవాలకు ప్రత్యేక యోగా శిక్షణ పొందాలని సూచించారు. జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ మాట్లాడుతూ.. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ యోగాసన జడ్జి, యోగా శిక్షకురాలు తోట సంధ్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శిభా, వైస్ ప్రిన్సిపల్ విజయ కుమారి, లెక్చరర్ సుప్రియ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అనూష, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బైరాన్‌పల్లిలో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 13: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి పల్లె దవాఖాన వైద్యుడు డాక్టర్ స్టువర్ట్‌సన్ అన్నా రు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పల్లె దవాఖాన ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యశిబిరంలో బీపీ కేసులు 5, షుగర్ కేసులు 2 గుర్తించి లద్నూర్ పీహెచ్‌సీకి రిఫర్ చేసినట్లు తెలిపారు. పలువురి రక్త నమూనాలు సేకరించినట్లు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోస్లిన్, ఏఎన్ఎం రత్నకుమారి, హెచ్ఏ దేవదాసు, ఎల్‌టీ రాజేందర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మెగా రక్తదాన శిబిరం సక్సెస్

సిద్దిపేటలో రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

సిద్దిపేట, జూన్ 13: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ మారుతి అన్నారు. ఎస్‌బీఐ 70వ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 110 మంది ఆఫీసర్స్, క్లర్కర్స్, అసోసియేట్స్ పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్ దరి, ఆఫీసర్స్ అసోసియేషన్ ఏవో హైదరాబాద్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నర్ర సంతోష్, యూనియన్ లీడర్ రామకృష్ణ, ఏజీఎస్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ క్రాంతి, ఆఫీసర్స్ సంతోష్, భీమా, అనిల్ కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

వరద కాలువను పరిశీలించిన కేంద్ర బృందం

తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

బెజ్జంకి, జూన్ 13: మండలంలోని వడ్లూర్ గ్రామ శివారులో మిడ్ మానేరు వరద కాలువను కేంద్ర బృంద సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరదకాలువ, నీటి విడుదల చేసే కాలువలు, తోటపల్లి ఆన్‌లైన్ రిజర్వాయర్ పరిశీలించి, రైతులకు ఇస్తున్న సాగునీరు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వడ్లూర్ శివారులో మరో ఉప కాలువ మంజూరైందని, భూమి సేకరిస్తే నిధులు విడుదలవుతాయని తెలిపారు. బృంద సభ్యుల్లో ఈఈ ధీరజ్ సింగల్, గ్రౌండ్‌వాటర్ బోర్డు సైంటిస్ట్ సుధీర్‌కుమార్, జిల్లా ఎస్ఈ సుమతి దేవి, ఈఈ రాములు, ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కార్యవర్గం ఏర్పాటు

హుస్నాబాద్‌టౌన్, జూన్ 13: హుస్నాబాద్ మండల, పట్టణ నూతన కార్యవర్గాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి సమక్షంలో శుక్రవారం ఎన్నుకున్నారు. హుస్నాబాద్ మండల సీపీఐ కార్యదర్శిగా గడిపె మల్లేష్, పట్టణ శాఖ కార్యదర్శిగా ఎగ్గోజు సుదర్శనచారిలు నియామకమయ్యారు. వీరితో పాటు మండల, పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 13: కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మద్దూరు మండల వ్యవసాయ శాఖ అధికారి బూరెల రామకృష్ణ శుక్రవారం ప్రకటనలో కోరారు. ఈనెల 5వ తేదీలోపు పట్టాదారు పాసుపుస్తకాలు పొం దిన రైతులు ఈనెల 20వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో భూమి పట్టా వివరాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతావివరాలు సమర్పించాలని సూచించారు. గతంలో రైతుభరోసా పొందిన రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవల్సిన అవసరం లేదని తెలిపారు.

16న హుండీ లెక్కింపు

హుస్నాబాద్ టౌన్, జూన్ 13: హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీని ఈనెల 16న సోమవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు హుండీ లెక్కింపులో పాల్గొనాలని ఆయన కోరారు.

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపికలు

గజ్వేల్, జూన్ 13: 2025-26 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి స్పోర్ట్స్ పాఠశాలకు మండల స్థాయి ఎంపికలు ఈ నెల 18న జడ్పీ పాఠశాల ప్రజ్ఞాపూర్‌లో ఉదయం 9గంటలకు నిర్వహిస్తామని ఎంఈవో కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనే విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మూడో తరగతి మార్కుల జాబితా, బోనఫైడ్, పాస్ ఫోటోలు, ఆధార్ కార్డులతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 96037 83280కు సంప్రదించాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు పోటీలు

హుస్నాబాద్ టౌన్, జూన్ 13: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపికకు హుస్నాబాద్ మండల స్థాయి పోటీలు ఈనెల 18,19న హుస్నాబాద్‌లోని మినీస్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బండారి మనీల ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు, 01 సెప్టెంబర్ 2016 నుంచి 31 ఆగస్టు 2017లోపు జన్మించిన వారై ఉండాలని తెలిపారు.

ఆకునూరులో రెవెన్యూ సదస్సు

దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

చేర్యాల, జూన్ 13: మండలంలోని ఆకునూరు మేజర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం తహసీల్దార్ దిలీప్ నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యలున్న పలువురు రైతులు అధికారులకు వినతిపత్రాలు అందించారు. సదస్సులో ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చేర్యాలలో మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

చేర్యాల, జూన్ 13 : తమ రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి మహిళలు తెలుసుకోవాలని హుస్నాబాద్ షీటీం సభ్యులు కోరారు. పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో మహిళలకు షీ టీమ్ సభ్యులు మహిళా చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వాట్సాప్‌కు వచ్చే ఎలాంటి లింకులు ఓపెన్ చేయవద్దని, బ్యాంకు అధికారుల పేరిట వచ్చే ఫోన్ కాల్స్ నమ్మవద్దన్నారు.అపరిచితుల మాటలు నమ్మవద్దని, ఏదైనా సంఘటన జరిగితే మహిళలు మౌనం వీడి పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. షీటీమ్ సభ్యులు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

గజ్వేల్, జూన్ 13: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను